క్లుప్తంగా

నేడు సామాజిక తనిఖీ బహిరంగ సభ

నందవరం: మండలంలో 2023–2024 వరకు చేపట్టిన ఉపాధి హామీ పనులపై శుక్రవారం సామాజిక తనిఖీ బహిరంగ సభ నిర్వహిస్తునట్లు ఎంపీడీఓ పుల్లయ్య తెలిపారు. గురువారం ఎంపీడీఓ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఆవరణలో 2023 ఏప్రిల్ 1 నుంచి 2024 మార్చి 31 వరకు చేపట్టిన ఉపాధి పనులపై శుక్రవారం మధ్యాహ్నం 2 గంటలకు సామాజిక తనిఖీ బహిరంగా సభ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. మండలంలోని 15 గ్రామ పంచాయతీల్లో ఉపాధి కింద 648 పనులకు గానూ రూ.76.92 కోట్లు, పీఆర్ పనులు 34కు గానూ రూ.4.47 కోట్లు ఖర్చు చేశామన్నారు. సామాజిక తనిఖీల్లో ఒక ఎస్ఆర్పీ, ఐదుగురు డీఆర్పీలు పాల్గొన్ని 8 రోజులు ఆయా గ్రామాల్లో జరిగిన ఉపాధి పనులను తనిఖీ చేశారన్నారు. బహిరంగ సభకు అధికారులు, మహిళా సంఘల సభ్యులు,ఉపాధి కూలీలు హాజరు కావాలని కోరారు. సూపరింటెండెంట్ కృష్ణమూర్తి, ఏపీఓ శ్రీనివాసులు, ఈసీ నూర్జహాన్ పాల్గొన్నారు.

ఖాదర్‌లింగస్వామి దర్గాలో భక్తుల సందడి



ప్రార్థనలు చేస్తున్న భక్తులు

కౌతాళం: మండల కేంద్రంలో మత సామరస్యానికి ప్రతీకగా వెలుగొందుతున్న జగద్గురు ఖాదర్‌లింగ స్వామి దర్గాకు గురువారం భక్తులు తరలివచ్చి స్వామి సన్నిధిలో భక్తి శ్రద్ధలతో ఫాతెహాలను జరుపుకున్నారు. దీంతో దర్గా పరిసరాలు భక్తులతో సందడిగా మారాయి. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు పిండి వంటలు వండి స్వామికి నైవేద్యంగా సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. రంజాన్ మాసం కావడంతో వచ్చిన భక్తులు దర్గాలోనే ఇఫ్తార్, ప్రత్యేక నమాజులు చేపట్టారు. తెల్లవారుజామున ఐదు గంటలకు దర్గా ధర్మకర్త సయ్యద్ మున్నపాషా చిష్టీ, పీఠాధిపతి ఖాదర్‌బాషా చిష్టీ స్వామి సమాధికి గంధం పూసి ప్రత్యేక ఫాతెహాలు చేపట్టారు.

పారిశుద్ధ్య పనుల పరిశీలన

ఆదోని టౌన్: ఆదోని మున్సిపాలిటీ పరిధిలో మురుగు కాలువలను ఏరోజుకారోజు శుభ్రం చేయాలని మున్సిపల్ కమిషనర్ ఎం.కృష్ణ వర్కర్లను ఆదేశించారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహించవద్దని సూచించారు. పట్టణంలోని హవన్నపేట ప్రాంతంలో మురుగు కాలువల క్లీనింగ్ పనులను ఆయన పరిశీలించారు. అనంతరం పాత బస్టాండు సర్కిల్‌లోని అన్నా క్యాంటీన్‌ను తనిఖీ చేశారు.

ఫ్యాప్టో జిల్లా సెక్రటరీ జనరల్‌గా భాస్కర్



ఆదోని సెంట్రల్: ఫ్యాప్టో రాష్ట్ర కమిటీ ఆదేశాలకు అనుగుణంగా 2025–27 కాలానికి ఫ్యాప్టో కర్నూలు జిల్లా ఎన్నికల పరిశీలకులు, రాష్ట్ర నాయకుడు ప్రకాష్‌రావు ఆధ్వర్యంలో నూతన కార్యవర్గ కమిటీని ఎన్నుకున్నారు. బీటీఏ జిల్లా అధ్యక్షుడు జి.భాస్కర్ జిల్లా ఫ్యాప్టో సెక్రటరీ జనరల్‌గా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ ఎన్నిక పట్ల బీటీఏ జిల్లా నాయకులు, కార్యకర్తలు హర్షం వ్యక్తం చేశారు.

కారు ఢీ..విద్యార్థికి గాయాలు



రంజిత్‌ను చికిత్సకు తరలిస్తున్న దృశ్యం

ఎమ్మిగనూరురూరల్: పట్టణంలోని ఎస్‌బీహెచ్ కాలనీ ఎల్ఐసీ కార్యాలయం సమీపంలో గురువారం ఉదయం సైకిల్‌పై వెళ్తున్న విద్యార్థి రంజిత్‌ను కారు ఢీ కొట్టడంతో గాయాలయ్యాయి. స్థానిక నారాయణ స్కూల్లో 8వ తరగతి చదువుతున్న రంజిత్ సైకిల్‌పై వెళ్తుండగా వేగంగా వస్తున్న కారు బాలుడిని ఢీ కొట్టి వెళ్లిపోయింది. ప్రమాదంలో బాలుడు ఎగిరి కింద పడిపోవటంతో తీవ్రంగా గాయపడ్డాడు. బాలుడిని చికిత్స కోసం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కారును డ్రైవ్ చేస్తున్నది మైనర్ అని స్థానికులు తెలిపారు.

అనుమతులు లేకుండా నిర్మాణాలు చేపడితే చర్యలు

మంత్రాలయం: జిల్లాలో కుడా అనుమతులు లేకుండా భవనాల నిర్మాణాలు చేపడితే చర్యలు తీసుకుంటామని కుడా చైర్మెన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు హెచ్చరించారు. గురువారం మండల కేంద్రంలో జిల్లా ప్లానింగ్ అధికారి విజయభాస్కర్, డీఈ గోపాల కృష్ణ, ఈఓ నాగరాజు ఆధ్వర్యంలో అనుమతులు లేకుండా నిర్మాణాలు చేపట్టిన లాడ్జీలను పరిశీలించి అనుమతులు తీసుకోవాలని, నిర్మాణాలకు తగట్టు అనుమతులు పొందాలని వారికి అవగాహన కల్పించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ మంత్రాలయంలో 75 లాడ్జీలు ఉండగా 44 లాడ్జీలు అనుమతుల కంటే అదనపు గదులు నిర్మించి డబ్బులు వసూళ్లు చేసుకుంటున్నారన్నారు. ఇప్పటికే 11 మంది స్వచ్ఛందంగా నిర్మాణాలకు అనుమతులు కావాలని కుడాను కోరారని చెప్పారు. సీఐ రామాంజులు, ఎస్ఐ శివాంజల్ ఉన్నారు.

ఆకలి తీర్చని ఉపాధి

- చేసిన పనికి వేతనం అందక కూలీల అవస్థలు
- మూడు నెలలుగా అందని వేతనాలు
- పట్టించుకోని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు
- ఉపాధిపై నమ్మకం లేక కూలీల వలసబాట
- ఇప్పటికే ఖాళీ అయిన గ్రామాలు
- వేతనాల కోసం రోడ్డుపై భిక్షాటన చేపట్టి నిరసన







ఉపాధి పనుల్లో పాల్గొన్న కూలీలు (ఫైల్), పెసలబండ గ్రామంలో వలస వెళ్తున్న కూలీలు

ఆదోని రూరల్: గ్రామీణ ప్రాంతాల్లోని కూలీలు, ప్రజలు ఇతర ప్రాంతాలకు వలస వెళ్లి అక్కడ ప్రమాదాలకు గురై కుటుంబాలను చిన్నాభిన్నం చేసుకోకుండా ఉన్న గ్రామంలోనే వారికి ఉపాధి చూపించాలనే ఉద్దేశంతో 2006లో యూపీఏ ప్రభుత్వం మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని ప్రవేశపెట్టింది. ఈ పథకం కింద పనులు చేసిన కూలీలకు వారం రోజుల్లోపు వేతనాలు అందించాల్సి ఉంది. ప్రతి కూలీకి రోజువారీ వేతనం రూ.300 నిర్దేశించగా, కూలీలు చేసిన పనికి రూ.275 ప్రకారం అందిస్తున్నారు. అయితే కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉపాధి కూలీలకు సకాలంలో వేతనాలు అందించడంలో పూర్తి నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయి. దీంతో వేతనం అందక కూలీలు బోరుమంటున్నారు.

మండలంలో 40,264 మందికి పైగా కూలీలు

ఆదోని మండలంలో మొత్తం 20,796 జాబ్‌కార్డులకు గాను యాక్టివ్ 16,337 ఉన్నాయి. 29,906 మంది కూలీలు ఉపాధి పనుల్లో పాల్గొంటున్నారు. మండలంలో మొత్తం 40,264 మంది కూలీలు ఉన్నారు. వీరికి 12 వారాల వేతనాలు అందాల్సి ఉంది. గత మూడు నెలలుగా వేతనాలు అందకపోవడంతో కూలీలు భిక్షాటన చేపట్టి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసన తెలుపుతున్నారు. ఉపాధిని నమ్ముకుని చేసిన పనులకు వేతనాలు అందకపోతే తమ కుటుంబాలను ఎలా పోషించుకోవాలని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఖాళీ అయిన గ్రామాలు

గ్రామాల్లో ఉపాధి పనులు చేసిన వారికి నెలల తరబడి వేతనాలు అందకపోవడంతో కుటుంబాలను పోషించుకునేందుకు పిల్లాపాపలతో కలిసి పట్టణాలకు వలస వెళ్తున్నారు. ఆదోని మండలంలో 44 గ్రామాలు ఉండగా దాదాపు 36 గ్రామాల ప్రజలు ఇతర ప్రాంతాలకు వలస వెళ్లారు. మండలంలోని ఆరేకల్, నాగలాపురం, కపటి, పెసలబండ, మాంత్రికి, బైచిగేరి, సుల్తానాపురం, బల్లేకల్, సాంబల్, పెద్దపెండేకల్, చిన్నపెండేకల్, దొడ్డనకేరి తదితర గ్రామాల ప్రజలు తట్టాబుట్టా సర్దుకుని బెంగళూరు, గుంటూరు, హైదరాబాద్ వంటి పట్టణాలకు వలస వెళ్లారు.

కుటుంబ పోషణ భారమైంది



ఉపాధి పథకాన్ని నమ్ముకుని ఎర్రటి ఎండలో కష్టపడి పనిచేస్తే కూలి అందలేదు. ఇప్పటివరకు 12 వారాలుగా కూలి రాకపోవడంతో కుటుంబాన్ని ఎలా పోషించుకోవాలో అర్థంగాక ఇబ్బందులు పడుతున్నాం. గత ప్రభుత్వంలో కూలీలకు ఇలాంటి దుస్థితి ఉండేది కాదు.

– మహేంద్రమ్మ, గణేకల్ గ్రామం

వలస వెళ్లింటే బాగుండనిపిస్తోంది



మా గ్రామంలో పనులు లేక చాలా మంది వలస వెళ్లారు. మే ము గ్రామంలోనే పొలాలు, ఇంటిని చూసుకుంటూ ఉపాధి పథకం ద్వారా వచ్చిన కూలితో జీవనం గడుపుదాం అని ఉండిపోయాం. అయితే చేసిన పనికి మూడు నెలలైనా వేతనం రాకపోవడంతో ఇల్లు గడవడం కష్టమైంది. మేము కూడా ఇతర ప్రాంతాలకు వలస వెళ్లి ఉంటే బాగుండేదని అనిపిస్తుంది.

– గొల్ల రంగనాథ్, కొత్తూరు గ్రామం

వేతనాల కోసం పోరాటం



ఉపాధి కూలీలు కష్టపడి చేసిన పనికి మూడు నెలలుగా వేతనాలు ఇవ్వకపోవడం బాధాకరం. దీంతో వారి కుటుంబాల పరిస్థితి దయనీయంగా మారింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి వెంటనే వేతనాలను అందించాలి. లేనిపక్షంలో కూలీలతో కలిసి పోరాటాలు చేస్తాం.

– రామాంజనేయులు, వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి

త్వరలోనే వేతనాలు అందుతాయి



వేతనాలు రాలేదని ఉపాధి కూలీలు అధైర్య పడొద్దు. త్వరలోనే కూలీలకు మూడు నెలలకు సంబంధించిన వేతనాలు అందుతాయి. దీనిపై ఇప్పటికే జిల్లా ఉన్నతాధికారులకు నివేదించాం. ఉపాధి పనుల్లో పాల్గొంటే గిట్టుబాటు వేతనం దక్కుతుంది.

– రాజేంద్రప్రసాద్, ఎంపీడీఓ

నవోదయకు విద్యార్థుల ఎంపిక



ఎరుకల విక్రమ్



రంజిత్

నందవరం : మండలంలోని ముగతి గ్రామానికి చెందిన ఎరుకల విక్రమ్ నవోదయకు ఎంపికయ్యాడు. గ్రామానికి చెందిన ఎరుకుల భీమేష్, సునీత దంపతులు రోజువారీ కూలీ పనిచేసుకుని జీవనం సాగించేవారు. నవోదయ ఫలితాల్లో తమ కుమారుడు విక్రమ్ 6వ, తరగతికి నవోదయకు ఎంపిక కావడంతో సంతోషం వ్యక్తం చేశారు.

నవోదయ సీటు సాధించిన బనవాసి విద్యార్థి

ఎమ్మిగనూరురూరల్: బనవాసి గ్రామానికి చెందిన విద్యార్థి రంజిత్ బనవాసి జవహర్ నవోదయ విద్యాలయంలో 6వ తరగతికి ఎంపికయ్యాడు. గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ బోయ రమేష్ కుమారుడు రంజిత్ పెద్దకడుబూరులో ఓ ప్రైవేట్ స్కూల్లో 5వ తరగతి చుదువుతున్నాడు. నవోదయ ఎంట్రెన్స్‌లో సీటు సాధించటంతో కటుంబ సభ్యులు సంతోషం వ్యక్తం చేశారు.

సాగు,తాగునీరు అందించాలి

కోసిగి: మండలంలో తాగు, సాగునీరు, ఉపాధి, రోడ్లు, మౌలిక వసతులు కల్పించాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు కె.వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట సీపీఎం ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. ఆయన మాట్లాడుతూ మండలంలో చాలా గ్రామాల్లో తాగునీటి కోసం ప్రజలు పనులు మానుకుని కుళాయిల వద్ద పడిగాపులు కాస్తున్నారన్నారు. సాగునీటిని అందించే ఆర్డీఎస్ కుడి కాల్వ పనులు నిలిచి పోయాయని, పులికనుమ ప్రాజెక్ట్ నుంచి సాగునీటిని అందక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అలాగే మండల కేంద్రంలో రైల్వే బ్రిడ్జి ఏర్పాటు చేసి ట్రాఫిక్ కష్టాలు లేకుండా చూడాలని కోరారు. నాయకులు రాముడు, వీరేష్, చిన్న, హనుమంతు, గోపాల్, రైతులు పాల్గొన్నారు.

పన్నులు వసూలు చేయాలి

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలో ఆస్తి, కుళాయి పన్నుల వసూళ్లు వంద శాతం సాధించాలని మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి సిబ్బందిని ఆదేశించారు. గురువారం సాయంత్రం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో సిబ్బందితో పన్ను వసూళ్లపై సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పట్టణ ప్రజలు పన్నులు చెల్లించేందుకు నాలుగు రోజుల సమయం మాత్రమే ఉందని తెలిపారు. పన్ను బకాయిలపై విధించిన వడ్డీలో 50శాతం వడ్డీ రాయితీని ప్రభుత్వం కల్పించినందున వసూళ్లపై దృష్టి సారించాలని చెప్పారు. ఆర్ఓ అస్లాంబాషా, ఆర్ఐలు సూరిబాబు,షెక్షావలి పాల్గొన్నారు.

పారిశుద్ధ్య మెరుగుకు సహకరించండి..



మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్

పట్టణంలో పారిశుద్ధ్య మెరుగుకు వ్యాపారులు సహకరించాలని మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి కోరారు.గురువారం పట్టణంలోని సోమప్ప సర్కిల్, బస్టాండ్ రోడ్, కర్నూలు బైపాస్ రోడ్, సున్నంబట్టీల ప్రాంతాల్లో చేపట్టిన పారిశుద్ధ్య పనులను తనిఖీ చేసి సిబ్బందికి,వ్యాపారులకు పలు సూచనలు చేశారు.

ఘనంగా బడేరాత్

కౌతాళం: రంజాన్ మాసంలో పవిత్రమైన రాత్రి బడేరాత్(షబ్-ఎ-ఖదర్) వేడుకలు గురువారం రాత్రి నుంచి శుక్రవారం తెల్లవారుజాము వరకు ఘనంగా జరిగాయి. ఖురాన్ అవతరించిన రోజును బడేరాత్ (షబ్-ఎ-ఖదర్)గా చెప్పుకుంటారు. ఈ ఒక్కరోజు రాత్రి చేసే నమాజు వెయ్యి నెలల నమాజుతో సమానం అని నమ్మకం. గురువారం రాత్రి 10 గంటల నుంచి శుక్రవారం తెల్లవారు జాము వరకు స్థానిక జామీయ మసీదు, మదీన మసీదు, నూరనీ మసీదు, అక్సా మసీదులల్లో ప్రార్థలను జరిపారు. మసీదులను విద్యుత్ దీపాలతో సుందరంగా ఆలంకరించారు. ఆయా మసీదుల్లో ఇమాం సాబులు బడేరాత్ ప్రత్యేకతను గురించి వివరించారు. ఈసందర్భంగా మదీనా మజీద్‌లో మౌలన అక్బర్ అలి, ఖాదర్‌లింగ స్వామి దర్గా ధర్మకర్త సయ్యద్ మున్నపాషా వుసేని చిష్టీ రంజాన విశిష్టతను వివరించారు.

30 పడకల ఆస్పత్రి ఏర్పాటు చేయాలి

పెద్దకడబూరు : మండల కేంద్రంలో 30 పడకల ఆస్పత్రి ఏర్పాటు చేయాలని సీపీఎం మండల కార్యదర్శి తిక్కన్న డిమాండ్ చేశారు. స్థానిక ఆదోని – పెద్దకడబూరు ప్రధాన రహదారిలో సీపీఎం ప్రజా చైతన్య యాత్ర సందర్భంగా గురువారం ధర్నా చేపట్టారు. ఆయన మాట్లాడుతూ మండల కేంద్రంలో ఎస్సీ కాలనీ నుంచి ఉన్నత పాఠశాల వరకు డ్రైనేజీ ఏర్పాటు చేయాలన్నారు. పెండింగ్‌లో ఉన్న సచివాలయ, రైతు భరోసా కేంద్రాల భవనాలను పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకు రావాలన్నారు. మండలాన్ని కరువు మండలంగా ప్రకటించినా పంటనష్ట పరిహారాన్ని చెల్లించలేదన్నారు. అనంతరం వినతి పత్రాన్ని తహసీల్దారు కార్యాలయ సిబ్బందికి సమర్పించారు. హనుమంతు, ఈరన్న, యర్రన్న, బాబు, అంజినేయ పాల్గొన్నారు.

అక్రమ అడ్మిషన్లను అరికట్టాలి

ఆదోని సెంట్రల్: అవినీతి, అక్రమాలకు పాల్పడుతున్న ఇంటర్మీడియెట్ బోర్డు అధికారి, కర్నూలు ఆర్ఐఓ గురువయ్యశెట్టిని తక్షణమే సస్పెండ్ చేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి యు.దస్తగిరి డిమాండ్ చేశారు. గురువారం స్థానిక బీమా సర్కిల్‌లో ధర్నా నిర్వహించారు. అనంతరం ఆర్ఐఓ గురువయ్యశెట్టి దిష్టిబొమ్మను దహనం చేశారు. ఏఐఎస్ఎఫ్ డివిజన్ కోశాధికారి శేఖర్, నాయకులు శివ, రవి, నాని, శ్రీను, వీరేష్, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

ఆదోని అర్బన్: పట్టణంలోని మసీదపుర కాలనీకి చెందిన జహంగీర్ (38) ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ గురువారం మృతిచెందాడు. వన్‌టౌన్ పోలీసులు తెలిపిన వివరాలు.. జహంగీర్ మద్యానికి బానిసయ్యాడని మరింత కిక్కు కోసం ఈనెల 23న నిద్ర మాత్రలు మింగాడు. అపస్మారక స్థితిలో ఉన్న జహంగీర్‌ను కుటుంబ సభ్యులు ఆదోని జనరల్ ఆసుపత్రికి తరలించగా కోలుకోలేక గురువారం మృతిచెందాడన్నారు. కుమార్తె మాత్రమే ఉందని చెప్పారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

అన్నదాన పథకానికి రూ.లక్ష విరాళం

మంత్రాలయం: శ్రీ రాఘవేంద్ర స్వామి మఠంలో నిర్వహించే అన్నదాన కార్యక్రమానికి హైదరాబాద్‌కు చెందిన శశికాంత్ అనే భక్తుడు రూ.లక్ష విరాళంగా అందజేసినట్లు మఠం మేనేజర్ వెంకటేష్ జోషి గురువారం తెలిపారు. అనంతరం శశికాంత్ కుటుంబ సభ్యులు గ్రామ దేవత మంచాలమ్మ, శ్రీ రాఘవేంద్ర మూల బృందావనానికి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు.

ఇసుక అక్రమంగా తరలిస్తే చర్యలు

గోనెగండ్ల: మండలంలోని గంజిహళ్లి గ్రామం హంద్రీ నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ఇసుక ట్రాక్టర్‌ను గురువారం సాయంత్రం పోలీసులు పట్టుకున్నారు. సీఐ విజయభాస్కర్ మాట్లాడుతూ గంజిహళ్లి గ్రామానికి చెందిన షేక్షావలి అనుమతులు తీసుకోకుండా హంద్రీనది నుంచి ఇసుకను అక్రమంగా వేరే ప్రాంతాలకు తరలిస్తుండగా గురువారం సాయంత్రం గోనెగండ్లలో ట్రాక్టర్‌ను సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

'ఉపాధి' వేతనం పెంచాలి

నందవరం : ఉపాధి హామీ పథకం కూలీలకు రోజు వారి వేతనం రూ.400 ఇవ్వాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం(బీకేఎంయూ) జిల్లా సహాయ కార్యదర్శి సోమేశ్వరరెడ్డి డిమాండ్ చేశారు. గురువారం మండలంలోని ముగతి గ్రామంలో ఉపాధి పనుల వద్ద సంఘం ఆధ్వర్యంలో కూలీలతో కలిసి ధర్నా చేపట్టారు.

ఇఫ్తార్ విందును తిరస్కరిస్తున్నాం

ఎమ్మిగనూరుటౌన్: వక్ఫ్ బిల్లు విషయంలో కూటమి ప్రభుత్వం ముస్లింల పక్షాన నిలబడకపోవడంతో ప్రభుత్వం ముస్లింలకు ఇచ్చే ఇఫ్తార్ విందును వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో ముస్లింలు బహిష్కరిస్తున్నట్లు పార్టీ నియోజకవర్గ యూత్ అధ్యక్షుడు నజీర్ అహమ్మద్ తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తెచ్చిన వక్ఫ్‌బోర్డ్ సవరణ బిల్లును కూటమి ప్రభుత్వం వ్యతిరేకించలేదన్నారు.

పార్టీ బలోపేతానికి కృషి చేయాలి



బందెనవాజ్, చికెన్ రాజాను సన్మానిస్తున్న దృశ్యం

గోనెగండ్ల: వైఎస్సార్‌సీపీ మండల కమిటీలో నూతనంగా ఎన్నికైన నాయకులు పార్టీ బలోపేతానికి కృషి చేయాలని పార్టీ జిల్లా కార్యదర్శి బందెనవాజ్ అన్నారు. మండల ఉపాధ్యక్షుడిగా చికెన్ రాజాను నియమిస్తూ పార్టీ అధిష్ఠానం ఇటీవల ప్రకటించడంతో గురువారం గోనెగండ్ల చికెన్ షాప్ అసోషియేషన్, కటికే కుల పెద్దల ఆధ్వర్యంలో చికెన్ రాజాతో పాటు బందెనవాజ్‌ను గజమాలలతో ఘనంగా సత్కరించారు. మాబువలి, గోవింద్, నది ముల్లా, పద్మనాభం, రఫీ, ఉస్మాన్ సాబ్, సత్తార్, హుసేన్ వలి, నబి రసూల్, కడపల ఉరుకుంద పాల్గొన్నారు.

రసాభాసగా వైడబ్ల్యూసీఎస్ సమావేశం

- ఇళ్ల స్థలాలు రిజిస్ట్రేషన్ చేసి ఇవ్వాలని సభ్యుల డిమాండ్
- చేనేత జౌళిశాఖ ఏడీతో సభ్యుల వాగ్వాదం



ఏడీ నాగ రాజారావుతో వాగ్వాదం చేస్తున్న సొసైటీ సభ్యులు

ఎమ్మిగనూరుటౌన్: ఎమ్మిగనూరు వీవర్స్ కోఆపరేటివ్ ప్రొడక్షన్, సొసైటీ లిమిటెడ్ తమకు ఇచ్చిన ఇళ్ల స్థలాలకు సంబంధించి రిజిస్ట్రేషన్ చేసి ఇచ్చేంతవరకు సర్వసభ్య సమావేశపు అజెండా ఆమోదించేది లేదంటూ సొసైటీ సభ్యుల వాగ్వాదంతో వైడబ్ల్యూసీఎస్ సర్వసభ్య సమావేశం రసాభాసగా జరిగింది. గురువారం స్థానిక వైడబ్ల్యూసీఎస్ కార్యాలయ ఆవరణలో సర్వసభ్య సమావేశం సొసైటీ ఇన్‌చార్జ్ కార్యదర్శి, చేనేత జౌళిశాఖ ఏడీ నాగరాజారావు అధ్యక్షతన జరిగింది. సమావేశంలో స్థానిక వీవర్స్ కోపరేటివ్ ప్రొడక్షన్,సేల్స్ సొసైటీలోనున్న సభ్యులకు పెద్దకడుబూరు మండలం హెచ్ మురవణి గ్రామ పంచాయతీలో ఇచ్చిన ఇళ్ల స్థలాలు రిజిస్ట్రేషన్ చేసి ఇవ్వాలని,ప్రభుత్వమే ఇళ్ల నిర్మాణాలు చేపట్టి ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అలాగే నూలు దారాల్లో నాణ్యత లేదని రంగులు పోతున్నాయని వాటి నాణ్యత పెంచాలన్నారు. సభ్యులు మృతి చెందింతే అంత్యక్రియలకు కనీసం రూ.10వేలు ఇవ్వాలని కోరారు. ఏళ్ల తరబడి తమ సమస్యలు చెబుతున్నా పరిష్కారం కావడం లేదని, అందుకే అజెండాను తాము ఆమోదించమని చెప్పి ఇంటిముఖం పట్టారు. అయితే సమావేశానికి ముందే అధికారులు సభ్యుల సంతకాలు తీసుకోవడంతో అజెండాలోని అంశాలను వారే ఆమోదించుకొని ఉంటారనికొందరు సభ్యులు ఆరోపించారు. కాగా.. సభ్యుల సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని ఇన్‌చార్జ్ కార్యదర్శి తెలిపారు. సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడుతూ 2023–24 ఆర్థిక సంవత్సం నాటికి గాను దాదాపు రూ.6కోట్లకు పైగా సొసైటీ నష్టాల్లో కొనసాగుతుందని తెలిపారు.

ఆర్ఐఓపై చర్యలు తీసుకోవాలి

కోసిగి: అవినీతి,అక్రమాలకు పాల్పడుతున్న కర్నూలు ఆర్ఐఓ గురువయ్య శెట్టిపై చర్యలు తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు వీరేష్ డిమాండ్ చేశారు. గురువారం స్థానిక వైఎస్సార్ సర్కిల్‌లో సంఘం ఆధ్వర్యంలో రాస్తారోకో చేపట్టి నిరసన తెలిపారు. ఆయన మాట్లాడుతూ ముందస్తుగా అధిక ఫీజులు, అక్రమ అడ్మిషన్లకు పాల్పడుతున్న ప్రైవేట్ విద్యాసంస్థల యజమాన్యులపై చర్యలు తీసుకోవాలని ఆర్ఐఓ కార్యాలయానికి వెళ్లిన ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు డి. సోమన్న, ఎస్. శాబీర్‌బాషా,తదితరలను దుర్భాషలాడి అవమానించి దాడికి యత్నించడం దారుణమన్నారు. అంజి, దివాకర్, శివ, నరసింహులు, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

మంత్రాలయం : కర్నూలు ఆర్ఐఓ గురువయ్య శెట్టిని తక్షణమే సస్పెండ్ చేసి విధుల నుంచి తొలగించాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి టి.థామస్ డిమాండ్ చేశారు. గురువారం స్థానిక



మంత్రాలయంలో దిష్టి బొమ్మను దహనం చేస్తున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

బాబూ జగ్జీవన్ రావు సర్కిల్‌లో సంఘం ఆధ్వర్యంలో ధర్నా చేపట్టి ఆయన దిష్టి బొమ్మ దహనం చేశారు.నాయకులు వీరేష్, శేఖర్, శివ, రవి, రాజు, మహేంద్ర, భాస్కర్, నవీన్, హరి పాల్గొన్నారు.

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలో ముందస్తు అడ్మిషన్లు చేసుకొనే ప్రైవేట్,కార్పొరేట్ కళాశాలలపై ఆర్ఐఓ చర్యలు తీసుకోవడంలో విఫలమయ్యారని ఏఐఎస్ఎఫ్ పట్టణ కార్యదర్శి ఖాదర్ అన్నారు. గురువారం స్థానిక కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. దస్తగిరి, సమీర్, రవి,మహేష్,వీరేష్ పాల్గొన్నారు.

సబ్‌జైలు తనిఖీ

ఆదోనిరూరల్: పట్టణంలోని ప్రత్యేక కారాగారాన్ని గురువారం జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి బి.లీలావెంకటశేషాద్రి తనిఖీ చేశారు. సబ్‌జైలులోని ఖైదీల వివరాలు, వారికి అందుతున్న సేవలను జైలు అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఖైదీలకు ఉచిత న్యాయసేవల గురించి వివరించారు. ములాఖత్‌కు వచ్చే వారికి కల్పించే సౌకర్యాలను పరిశీలించారు. అనంతరం ఖైదీల హాజరు పట్టికను పరిశీలించి, వారికి ఏదైనా సమస్య వస్తే సంబంధిత మండల న్యాయసేవాధికార సంస్థ వారిని సంప్రదించాలని సూచించారు. వంట



మాట్లాడుతున్న జడ్జి బి.లీలావెంకటశేషాద్రి

గదులు, జైలు గదులను పరిశీలించారు. ప్రత్యేక కారాగార సూపరింటెండెంట్ విష్ణు, జైలు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

వేలంలో పంచాయతీకి ఆదాయం



వేలాలను నిర్వహిస్తున్న డీఎల్‌పీఓ నూర్జహాన్

కౌతాళం: స్థానిక మేజర్ పంచాయతీలో వివిధ పన్నుల వసూలుకు వేలం పాటలను గురువారం సర్పంచ్ పాల్‌దినకర్ అధ్యక్షతన డీఎల్‌పీఓ నూర్‌జహాన్, ఈఓపీఆర్‌డీ యోగేశ్వర్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి ప్రకాశం నిర్వహించారు. వేలాలతో పంచాయతీకి రూ.9,03,875 ఆదాయం సమకూరింది. వివరాలు.. బండమెట్ట గత డేడాది రూ.3,31,750 పోగా.. ఈ ఏడాది రూ.11,70,000 పలికింది. కమేళా గత ఏడాది రూ.40,500 పోగా ఈ ఏడాది రూ.1,05,000కు దక్కించుకున్నారు. దినసరి మార్కెట్ నిరుడు రూ. 13,875కు పోగా ప్రస్తుతం రూ.15వేలకు పలికింది. గత ఏడాది వేలాల ద్వారా పంచాయతీకి రూ.3,86,125 ఆదాయం రాగా.. ప్రస్తుతం రూ. 12,90,000లు లభించింది. మొత్తం మీద గత ఏడాది కన్నా రూ. 9,03,875 అధికంగా సమకూరిందని అధికారులు తెలిపారు.

హాల్వీలో..

మండలంలోని హాల్వీ గ్రామంలో వేలం పాటలను డీఎల్‌పీఓ నూర్జహాన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. బండమెట్ట గత ఏడాది రూ.4,71,000 పోగా, ఈ ఏడాది రూ.8,38,000కు పలికింది. వారపు సంత నిరుడు రూ.14,500 పోగా.. ఈ ఏడాది రూ.16,500 దక్కించుకున్నారు. గత ఏడాది కన్న ఈ ఏడాది పంచాయతీకి రూ.3,69,000 ఆదాయం పెరిగినట్లు సర్పంచ్ క్రాంతి, పంచాయతీ కార్యదర్శి అబ్దుల్‌కరీం తెలిపారు.

విద్యుత్ కార్గో వాహనాన్ని తయారు చేసిన విద్యార్థులు



కార్గో వాహనంతో విద్యార్థులు, ప్రిన్సిపాల్ సుధాకర్

ఎమ్మిగనూరురూరల్: మండలంలోని ఎర్రకోట సెయింట్ జాన్స్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ కాలేజీలో నాల్గవ సంవత్సరం బీ.టెక్, ఈఈఈ విభాగానికి చెందిన విద్యార్థులు విద్యుత్ కార్గో వాహనాన్ని తయారు చేసి శభాష్ అనిపించుకున్నారు. 28 మంది విద్యార్థులు ఈ విద్యుత్ కార్గో వాహనాన్ని శూన్య ఉద్గారాలతో పనిచేసేలా తయారు చేశారు. ఈ వాహనానికి నాలుగు గంటలు చార్జింగ్ చేస్తే 40 కి.మీ. వరకు ప్రయాణం చేయవచ్చు. మొత్తం వ్యయం రూ.1,25,000 అయ్యింది. విద్యార్థులతో పాటు ఈ ప్రాజెక్ట్ విభాగపతులైన చిదాంబరం శెట్టి, సయ్యద్‌సొహెబ్, ఎంఎస్.శివకుమార్, ఆమీర్ ఖురేషి, ఆమీర్‌సోహెల్, రమేష్‌బాబును ప్రిన్సిపాల్ అభినందించారు.

పెద్దమరివీడు వాసికి డాక్టరేట్

గోనెగండ: పెద్దమరివీడు గ్రామానికి చెందిన ఈడిగ లింగప్ప తమిళనాడులోని సవిత యూనివర్సిటీ నుంచి డాక్టరేట్ పొందారు. ఆయన బంధువులు తెలిపిన వివరాల మేరకు.. పెద్దమరివీడు గ్రామానికి చెందిన ఈడిగ హనుమన్న కుమారుడు ఈడిగ లింగప్ప హైదరాబాద్‌లోని మాల్లారెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌తో పాటు హెచ్ఓడీగా పనిచేస్తున్నాడు. అయితే తమిళనాడు రాష్ట్రంలో సవిత యూనివర్సిటీలో కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్, రీచర్స్ ఇన్ ఐడెంటిఫికేషన్ ఆఫ్ బో న్యూజింగ్ ఎంఆర్ఐ, క్లాసిఫికేషన్ యూజింగ్ టెక్నిక్‌పై పరిశోధన పత్రం సమర్పించడంతో యూనివర్సిటీ చాన్సలర్ డాక్టర్ వీరయ్య నుంచి ఇటీవల డాక్టరేట్ పట్టా అందుకున్నాడు. గురువారం పెద్దమరివీడులో ఆయన కుటుంబ సభ్యులు, స్నేహితులు మిఠాయిలు పంచుకొని సంబరాలు చేసుకున్నారు.

సారా రహిత గ్రామాలుగా తీర్చిదిద్దుదాం

మంత్రాలయం: నాటుసారా లేని గ్రామాలుగా తీర్చుదిద్దడమే నవోదయం 2.0 ప్రధాన లక్ష్యమని ఎక్సైజ్ ఎమ్మిగనూరు సీఐ రమేష్ రెడ్డి తెలిపారు. గురువారం మండలంలోని మాధవరం తండా, పరమాన్ దొడ్డి తండా గ్రామాల్లో పర్యటించి అవగాహన సదస్సు నిర్వహించారు. నాటుసారా వల్ల కలిగే దుష్ప్రభావం, అనారోగ్య సమస్యలను వివరించారు.